


EVENING EDITION

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com

4PM
www.suryaa.com
శుక్రవారం
05 జూలై 2024
పేజీలు: 02




# పాక్‌లో రూ.370కి చేరిన లీటరు పాల ధర!

పాకిస్థాన్ ప్రజలపై అక్కడి ప్రభుత్వం మరో భారం మోపింది. ప్యాకేజ్డ్ పాలపై 18% పన్ను విధించడంతో ధరలు 25% పెరిగాయి. అల్ట్రా హై టెంపరేచర్ పాల ధర రూ.370కి చేరింది. ఇది అభివృద్ధి చెందిన ఆస్ట్రేలియా, ఫ్రాన్స్ దేశాల్లోని ధరల కంటే అధికం. ఈ నిర్ణయంతో ద్రవ్యోల్బణం పెరుగుతుందని, పేదరికంలో ఉన్న చిన్నారుల్లో పౌష్టికాహార లోపానికి దారితీస్తుందని నిపుణులు చెబుతున్నారు. ఇప్పటికే పాక్‌లో నిత్యవసరాలు, ఇంధన ధరలు భారీగా పెరిగాయి.

# బ్రిటన్ ప్రధానిగా కీర్ స్టార్మర్



బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో ప్రతిపక్ష లేబర్ పార్టీ చారిత్రాత్మక విజయం దిశగా సాగుతోంది. 650 సీట్లున్న పార్లమెంట్‌లో లేబర్ పార్టీ ఇప్పటివరకు 400 సీట్లకు పైగా గెల్చుకుంది. ప్రభుత్వం ఏర్పాటు చేయాలంటే 326 సీట్లు వస్తే సరిపోతుంది. దీంతో లేబర్ పార్టీకి చెందిన నేత కీర్ స్టార్మర్ బ్రిటన్ తదుపరి ప్రధానమంత్రిగా బాధ్యతలు చేపట్టనున్నారు. కీర్ స్టార్మర్ మాజీ మానవ హక్కుల న్యాయవాది, పబ్లిక్ ప్రాసిక్యూటర్, మ్యూజీషియన్ కూడా. ఆయన వయసు ప్రస్తుతం 61 ఏళ్లు. గత 50 ఏళ్లలో ఈ వయసులో బ్రిటన్ ప్రధానమంత్రి అయిన వ్యక్తిగా స్టార్మర్ నిలిచారు. అంతేగాక పార్లమెంట్‌కు ఎన్నికైన తొమ్మిదేళ్లలోనే ప్రధానమంత్రి పదవి చేపడుతుండటం మరో విశేషం. సెప్టెంబరు 2, 1962న జన్మించిన కీర్.. రోడ్నీ స్టార్‌మర్, లండన్ శివార్లలో ఒక ఇరుకైన ఇంట్లో బాల్యాన్ని గడిపాడు. అతనికి ముగ్గురు తోబుట్టువులు. లీడ్స్, ఆక్స్‌ఫర్డ్ విశ్వవిద్యాలయాలలో న్యాయ విద్యను అభ్యసించాడు. అనంతరం వామపక్ష కారణాలు, డిఫెండింగ్ ట్రేడ్ యూనియన్లు, మెక్‌డొనాల్డ్స్ వ్యతిరేక కార్యకర్తలు, విదేశాల్లోని ఖైదీల మరణ శిక్షలు వంటి వాటిపై దృష్టి సారించాడు. అనంతరం మానవ హక్కుల న్యాయవాదిగా ప్రాక్టీస్ ప్రారంభించాడు. తొలుత 2003లో ఉత్తర ఐర్లాండ్‌లోని పోలీసులు మానవ హక్కుల చట్టంలో చిన్న ఉద్యోగంలో చేరాడు. అయిదేళ్ల తర్వాత లేబర్ పార్టీకి చెందిన గోర్డాన్ బ్రౌన్ ప్రధాన మంత్రిగా ఉన్న సమయంలో ఇంగ్లాండ్ అండ్ వేల్స్‌కు పబ్లిక్ ప్రాసిక్యూషన్స్ డైరెక్టర్‌గా నియమితుడయ్యాడు. 2008 నుంచి 2013 మధ్య వరకు ఎంపీలు తమ ఖర్చులను దుర్వినియోగం చేయడం, జర్నలిస్టుల ఫోన్ హ్యాకింగ్, గ్లండ్‌లో యువత అల్లర్ల వంటి విచారణలను ఆయన పర్యవేక్షించాడు. తన పనితనంతో క్వీన్ ఎలిజబెత్ 2 చేత నైట్ ర్యాంక్ బిరుదు పొందారు. 50 ఏళ్ల వయసులో కీర్ స్టామర్ రాజకీయాల్లోకి రావడం గమనార్హం. 2015 నార్త్ లండన్ నుంచి ప్రాతినిధ్యం వహిస్తూ పార్లమెంటు సభ్యునిగా ఎన్నికయ్యారు.



## బ్రిటన్ ఎన్నికల్లో ఘోర పరాజయం.. రిషి సునాక్ క్షమాపణలు

బ్రిటన్ పార్లమెంట్ ఎన్నికల్లో అధికార కన్జర్వేటివ్ పార్టీ ఘోర పరాజయాన్ని మూటగట్టుకుంది. గురువారం మొదలైన ఓట్ల లెక్కింపులో ప్రతిపక్ష లేబర్ పార్టీకే ప్రజలు పట్టం కట్టారు. దాదాపు 300కు పైగా స్థానాల్లో ముందంజలో కొనసాగుతూ అధికారం చేపట్టే దిశగా దూసుకుపోతుంది. భారత సంతతికి చెందిన ప్రధాని రిషి సునాక్ నాయకత్వంలోని కన్జర్వేటివ్ పార్టీకన్జర్వేటివ్ పార్టీ కేవలం 63 స్థానాల్లో మాత్రమే ఆధిక్యంలో ఉంది. ఓట్ల లెక్కింపు ఇంకా కొనసాగుతోంది. దీంతో బ్రిటన్‌ను 14 ఏళ్ల పాటు అప్రతిహతంగా ఏలిన కన్జర్వేటివ్ పార్టీకి భంగపాటు ఖాయంగా మారింది. ఇక బ్రిటన్ ఎన్నికల్లో కన్వర్జేటివ్ పార్టీ ఓటమిని ప్రధాని రిషి సునాక్ అంగీకరించారు. రిచ్‌మండ్ అండ్ నార్తర్న్ అలెర్టన్‌లో తన మద్దతుదారులను ఉద్దేశించి రిషి సునాక్ మాట్లాడుతూ.. సార్వత్రిక ఎన్నికల్లో కన్వర్జేటివ్ పార్టీ ఓటమికి తాను బాధ్యత వహిస్తున్నట్లు చెప్పారు.



## పెద్ద అంబర్‌పేట ఓఆర్ఆర్ వద్ద పోలీసుల కాల్పులు.. పార్ధి గ్యాంగ్ అరెస్ట్

ఎదురు తిరిగిన పార్ధి గ్యాంగ్.. గాల్లోకి కాల్పులు జాతీయరహదారిపై పార్కింగ్ వాహనాలే లక్ష్యంగా దోపిడీలకు పాల్పడుతున్న పార్ధి గ్యాంగ్‌ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఈ క్రమంలో గాల్లోకి కాల్పులు జరిపారు. హైదరాబాద్ శివార్లలోని పెద్ద అంబర్‌పేట సమీపంలో ఔటర్ రింగ్‌రోడ్డు (ORR) వద్ద ఈ ఘటన చోటుచేసుకున్నది. ఇటీవల నేషనల్ హైవేపై పార్కింగ్ వాహనాలే లక్ష్యంగా వరుస చోరీలు చోటుచేసుకుంటున్నాయి. దీంతో అప్రమత్తమైన నల్లగొండ పోలీసులు ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేశారు. ఈ క్రమంలో శుక్రవారం తెల్లవారుజామున పెట్రోలింగ్ పోలీసులు దొంగల ముఠాను గుర్తించి వెంబడించారు. రాచకొండ కమిషనరేట్ పరిధిలోకి వచ్చిన తర్వాత ఇక్కడి పోలీసులను అప్రమత్తం చేశారు. రాచకొండ, నల్లగొండ సీసీఎస్ పోలీసులు సంయుక్తంగా దొంగలను పట్టుకునేందుకు యత్నించారు. దీంతో వారిపై దొంగలు కత్తులతో ఎదురుదాడికి పాల్పడ్డారు. ఈ నేపథ్యంలో పోలీసులు గాల్లోకి రెండు రౌండ్లు కాల్పులు జరిపారు. అనంతరం నలుగురు దొంగలను అదపులోకి తీసుకున్నారు. వారిని నల్లగొండకు తరలించనున్నారు.

## ఏపీలో అతిసారం విజృంభణ

ఏపీలోని తూర్పు గోదావరి జిల్లా సీతానగరం గ్రామ పంచాయతీ పరిధిలో అతిసారం కేసులు కలవరపెడుతున్నాయి. లంకూరు, దళితపేట, వడ్డెరపేట పరిధిలోని పలు కుటుంబాలకు చెందిన సుమారు 20 మంది వాంతులు, విరేచనాలతో అస్వస్థతకు గురయ్యారు. దాంతో ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు పరుగులు తీశారు. కొందరి పరిస్థితి విషమించడంతో రాజమహేంద్రవరంలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.



## మైనర్ బాలికతో అసభ్య ప్రవర్తన.. వైసీపీ మాజీ ఎమ్మెల్యే అరెస్ట్

ఏపీలో వైసీపీ నేతలను అరెస్టులు వెంటాడతున్నాయి. ఇటీవల ఎన్నికల సమయంలో ఘర్షణల కారణంగా మాజీ ఎమ్మెల్యే పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని అరెస్ట్ చేసిన పోలీసులు... ఇప్పుడు మరో మాజీ ఎమ్మెల్యే సుధాకర్‌ను అదుపులోకి తీసుకున్నారు. మైనర్ బాలికపై లైంగిక వేధింపుల ఆరోపణలతో సుధాకర్‌పై పోక్సో చట్టం సెక్షన్ 6 రెడ్‌విత్ 5(ఎల్) కింద కేసు నమోదు చేశారు. కర్నూలులోని తన నివాసంలోనే సుధాకర్‌ను పోలీసులు అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. అనంతరం వైద్య పరీక్షలు నిర్వహించి... సుధాకర్ ను కోర్టులో ప్రవేశపెట్టగా అతనికి 14 రోజుల రిమాండ్ విధించింది కోర్టు. దీంతో జిల్లా కారాగారానికి సుధాకర్‌ను తరలించారు.ఎన్నికలకు ముందే సుధాకర్‌పై లైంగిక వేధింపుల ఆరోపణలొచ్చాయి. తన ఇంట్లో పనిచేసే ఓ యువతిపై సుధాకర్ అసభ్యంగా ప్రవర్తించారన్న ఆరోపలున్నాయి. అందుకు సంబంధించిన వీడియో కూడా సోషల్ మీడియాలో చక్కర్లు కొట్టడంతో... అప్పట్లో మహిళా సంఘాలు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగాయి. సుధాకర్‌కు వ్యతిరేకంగా ధర్నాలకు సైతం దిగాయి. ఇక ఇప్పుడు ఆయనపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయడం కర్నూలులో హాట్‌టాపిక్‌గా మారింది. మరోవైపు పలువురు టీడీపీ నేతలు సైతం సుధాకర్ తీరుపై తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. 2019 ఎన్నికల్లో కర్నూలు మెజారిటీతో గెలిచారు డాక్టర్ సుధాకర్. అయితే ఆయనపై ఇలాంటి లైంగిక ఆరోపణల నేపథ్యంలో .. 2024 ఎన్నికల్లో వైసీపీ అధిష్టానం ఆయనకు టికెట్ కేటాయించలేదు.



## కాంగ్రెస్‌లో చేరిన బీఆర్ఎస్ ఆరుగురు ఎమ్మెల్సీలు

అధికార కాంగ్రెస్‌లోకి వలసలు కొనసాగుతున్నాయి. బీఆర్ఎస్ పార్టీకి చెందిన ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్ కండువా కప్పకున్నారు. గురువారం అర్ధరాత్రి సీఎం రేవంత్ రెడ్డి సమక్షంలో హస్తం పార్టీలో చేరారు. ఎమ్మెల్సీలు భాను ప్రసాద్, సారయ్య, దండె విఠల్, ఎంఎస్ ప్రభాకర్, యెగ్గె మల్లేశం, బుగ్గారపు దయానంద్‌లకు పార్టీ రాష్ట్ర దీపాదాస్ మున్షీ కాంగ్రెస్ కండువా కప్పి వారిని పార్టీలోకి ఆహ్వానించారు. దీంతో శాసన మండలిలో కాంగ్రెస్ సభ్యుల సంఖ్య 12కు చేరింది.ఇటీవల శాసనసభ మాజీ స్పీకర్, ఎమ్మెల్యే పోచారం శ్రీనివాస్‌రెడ్డి, జగిత్యాల ఎమ్మెల్యే సంజీవ్ కుమార్ కాంగ్రెస్‌లో చేరిన విషయం తెలిసిందే. దీంతో ఇప్పటివరకు భారాస నుంచి ఆరుగురు ఎమ్మెల్యేలు, ఆరుగురు ఎమ్మెల్సీలు కాంగ్రెస్‌లో చేరినట్లు అయింది.



## తెలంగాణలో త్వరలో కొత్త రేషన్ కార్డులు

ఆరోగ్యశ్రీతో సంబంధం లేకుండా త్వరలోనే కొత్త రేషన్ కార్డులు ఇస్తామని సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. సన్న బియ్యం పండించే రైతులను ప్రోత్సహిస్తామని వెల్లడించారు. వాటినే మిల్లింగ్ చేయించి రేషన్‌కార్డుదారులకు సన్న బియ్యం పంపిణీ చేస్తామని తెలిపారు. బియ్యాన్ని వినియోగదారులే తింటారు కాబట్టి రీసైక్లింగ్ ఆగిపోతుందని సీఎం రెవంత్ రెడ్డి అభిప్రాయపడ్డారు.



## బాలకృష్ణ అభిమానిగా కనిపిస్తా

'తిరగబడరాసామీ' చిత్రం ద్వారా కథానాయికగా తెలుగు సినీరంగానికి పరిచయమవుతున్నది మాల్వి మల్హోత్రా. రాజ్‌తరుణ్ హీరోగా ఏఎస్ రవికుమార్ చౌదరి దర్శకత్వంలో రూపొందిన ఈ చిత్రం త్వరలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సందర్భంగా గురువారం మాల్వి మల్హోత్రా పాత్రికేయులతో మాట్లాడుతూ 'మాది హిమాచల్‌ప్రదేశ్. థియేటర్ ఆర్ట్స్ చేసిన అనంతరం టీవీ ఇండస్ట్రీలోకి వెళ్లాను. ఆ తర్వాత హిందీ, తమిళ భాషల్లో ఒక్కో సినిమా చేశా' అని చెప్పింది.'తిరగబడరాసామీ' చిత్రంలో తాను బాలకృష్ణ అభిమాని పాత్రలో కనిపిస్తానని, తన క్యారెక్టర్ కారణంగానే కథ మలుపులు తీసుకుంటుందని, చక్కటి ఫ్యామిలీ ఎమోషన్స్‌తో సాగే చిత్రమిదని తెలిపిందీ భామ. 'మహిళలకు సెల్ఫ్ డిఫెన్స్‌లో తర్ఫీదునిచ్చే యువతిగా కనిపిస్తాను.



## హీరో రాజ్ తరుణ్ పై పోలీసులకు ఫిర్యాదు చేసిన ప్రియురాలు లావణ్య


టాలీవుడ్ యంగ్ హీరో రాజ్‌తరుణ్‌పై అతని ప్రేయసి లావణ్య పోలీస్ స్టేషన్‌ను ఆశ్రయించడం హాట్ టాపిక్‌గా మారింది. రాజ్ తరుణ్ తనను పెళ్లి చేసుకుంటానని నమ్మించి వదిలేసి వెళ్లిపోయాడని లావణ్య నార్సింగి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేసింది. తాము విడిపోవడానికి కారణం ఓ సినీ నటి కారణమని.. రాజ్ తరుణ్‌ను వదిలేకపోతే చంపేసి బాడీ కూడా మాయం చేస్తున్నారని సినీ నటితోపాటు ఆమె సోదరుడిపై ఫిర్యాదు చేసింది లావణ్య.పదకొండేళ్లుగా రాజ్‌తరుణ్‌తో రిలేషన్‌షిప్‌లో ఉన్నా. గుడిలో కూడా పెళ్లి చేసుకున్నాం. కానీ తన సినిమాలో నటిస్తోన్న హీరోయిన్‌తో అఫైర్ పెట్టుకొని నన్ను వదిలేశాడు. 3 నెలల క్రితం రాజ్ తరుణ్ ఇంటి నుంచి వెళ్లిపోయి దూరంగా ఉంటున్నాడు. రాజ్ తరుణ్‌ను వదిలేయకపోతే చంపేసి బాడీ కూడా మాయం చేస్తామని బెదిరిస్తున్నారు. రాజ్ తరుణ్ నా ప్రపంచం..రాజ్ తరుణ్ నాకు కావాలి. నాకు న్యాయం చేయాలి. గతంలో తనను డ్రగ్స్ కేసులో కావాలనే ఇరికించారని లావణ్య ఆవేదన వ్యక్తం చేసింది.

నేటి దినపత్రిక సూర్య
www.suryaa.com
EVENING EDITION 4PM

## విశ్వవిజేత విజయయాత్రకు
# ముంబైలో జననీరాజనం



సుదీర్ఘ నిరీక్షణకు తెరదించుతూ ఐసీసీ టీ20 ప్రపంచ చాంపియన్లుగా నిలిచిన భారత క్రికెట్ జట్టు స్వదేశానికి చేరుకుంది. 13 ఏండ్ల తర్వాత ప్రపంచకప్ ట్రోఫీని ముద్దాడి స్వదేశానికి తిరిగొచ్చిన టీమ్ఇండియాకు 'ఢిల్లీ నుంచి ముంబై' దాకా అడుగడుగునా ఘనస్వాగతం లభించింది. ఢిల్లీలో ప్రధాని నరేంద్ర మోదీతో సమావేశమైన అనంతరం ముంబైకి వచ్చిన రోహిత్ సేన 'వన్స్ ఇన్ ఎ లైఫ్ టైమ్ మూవ్‌మెంట్'ను తనివితీరా ఆస్వాదించింది. వీరుల విజయోత్సవ ర్యాలీకి అరేబియా తీరం అభిమాన జన సంద్రమైంది.
ఐసీసీ టీ20 ప్రపంచకప్‌ను గెలుచుకున్న భారత జట్టు ఆరు రోజుల విరామం తర్వాత స్వదేశానికి చేరుకుంది. బుధవారం సాయంత్రం బార్బడోస్ నుంచి ప్రత్యేక విమానంలో బయల్దేరిన టీమ్ఇండియా గురువారం ఉదయం 6 గంటలకే ఢిల్లీ విమానాశ్రయంలో దిగింది. ఇందిరాగాంధీ అంతర్జాతీయ విమానాశ్రయంలో వేలాది అభిమానులు ఘనస్వాగతం పలకగా చాణిక్యపురిలోని ఐటీసీ మౌర్య హోటల్‌కు వెళ్లిన భారత జట్టు.. అక్కడ్నుంచి నేరుగా ప్రధాని నరేంద్ర మోదీ నివాసంలో ఆయనతో సమావేశమైంది. 'చాంపియన్ల'ను అభినందించిన అనంతరం వారితో కలిసి అల్పాహారం చేసిన మోదీ.. జట్టుతో కాసేపు ముచ్చటించి వారి అనుభవాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమం ముగిశాక టీమ్ఇండియా ప్రత్యేక విమానంలో దేశ ఆర్థిక రాజధానికి పయనమమైంది.అనుకున్న షెడ్యూల్ (సాయంత్రం 5 గంటలకు) కంటే విజయయాత్ర రెండు గంటల (రాత్రి 7.30 గంటలకు మొదలైంది) పాటు ఆలస్యమైనా అభిమానులు తమ అభిమాన ఆటగాళ్ల కోసం వర్షాన్ని సైతం లెక్క చేయకుండా ఆనందంగా వేచి చూశారు. ఇక ఓపెన్ టాప్ బస్సులో విక్టరీ పరేడ్ మొదలయ్యాక ఆటగాళ్లకు అడుగడుగునా జననీరాజనమే. రోహిత్, కోహ్లి, పాండ్యా, సూర్య, పంత్, సిరాజ్ అభిమానులను ఉత్సాహపరుస్తూ జైత్రయాత్రను నడిపించారు. అంగరంగ వైభవంగా సాగిన జైత్రయాత్ర రెండు గంటల తర్వాత వాంఖడే చేరిన భారత జట్టుకు బీసీసీఐ చిరు సత్కారం చేసింది. అధ్యక్షుడు రోజర్ బిన్నీ, సెక్రటరీ జై షా, ఉపాధ్యక్షుడు రాజీవ్ శుక్లా భారత జట్టుకు రూ.125 కోట్ల ప్రైజ్‌మనీ చెక్‌ను అందజేశారు. అనంతరం వాంఖడేలో అభిమానుల కేరింతల నడుమ ఆటగాళ్లంతా వారికి కృతజ్ఞతలు చెబుతూ స్టేడియం అంతా కలియతిరిగారు. తమ ప్రపంచకప్ అనుభవాలను కెప్టెన్ రోహిత్‌శర్మ, విరాట్‌కోహ్లి, బుమ్రా, చీఫ్ కోచ్ రాహుల్ ద్రవిడ్ పంచుకున్నారు. తమకు మద్దతు పలికేందుకు స్టేడియానికి వేలాదిగా తరలివచ్చిన అభిమానులకు క్రికెటర్లు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమం పూర్తయ్యే వరకు భారీగా పోలీసులను మోహరించారు.




## షూటింగ్ ముగించుకున్న
# డబుల్ ఇస్మార్ట్

ఉస్తాద్ రామ్ పోతినేని నటిస్తున్న క్రేజీ సీక్వెల్ మూవీ 'డబుల్ ఇస్మార్ట్' ఇప్పటికే ప్రేక్షకుల్లో సాలిడ్ అంచనాలు క్రియేట్ చేసింది. ఈ సినిమాను దర్శకుడు పూరీ జగన్నాథ్ తెరకెక్కిస్తుండటంతో ఈ మూవీ బాక్సాఫీస్ వద్ద ఎలాంటి విజయాన్ని అందుకుంటుందా అని అభిమానులు చూస్తున్నారు. ఇక ఈ సినిమాకు సంబంధించి మేకర్స్ తాజాగా ఓ అప్డేట్ ఇచ్చారు. ఇప్పటికే ఈ సినిమా ఫస్ట్ లుక్ పోస్టర్స్, టీజర్, ఫస్ట్ సాంగ్ ను రిలీజ్ చేసిన చిత్ర యూనిట్ తాజాగా ఈ చిత్ర షూటింగ్ ముగిసినట్లు తెలిపారు. ఓ స్పెషల్ పోస్టర్ తో ఈ విషయాన్ని మేకర్స్ అనౌన్స్ చేశారు. ఇక ఈ సినిమా ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులను శరవేగంగా జరుపుకుంటోంది. ఈ సినిమాలో అందాల భామ కావ్య తాపర్ హీరోయిన్ గా నటిస్తోంది. ఈ సినిమాలో బాలీవుడ్ నటుడు సంజయ్ దత్ విలన్ పాత్రలో నటిస్తుండగా బాని జె, అలీ, గెటప్ శ్రీను, షాయాజీ షిండే, మక్రంద్ దేశ్పాండే తదితరులు ఇతర ముఖ్య పాత్రల్లో నటిస్తున్నారు. ఈ సినిమాకు మణిశర్మ సంగీతం అందిస్తుండగా పూరి కనెక్ట్స్ బ్యానర్ పై ఛార్మి, పూరీ జగన్నాథ్ ఈ చిత్రాన్ని ప్రొడ్యూస్ చేస్తున్నారు.
ఈ సినిమా ఆగస్టు 15న వరల్డ్ వైడ్ రిలీజ్ కు రెడీ అవుతోంది.



## టికెట్ల ధరలపై అపోహలు..
# కల్కి నిర్మాత కీలక ప్రకటన

సినిమా టికెట్ రేట్ల విషయంలో తన వ్యాఖ్యలతో అపోహలు వస్తున్నాయని నిర్మాత సి.అశ్వనీదత్ తెలిపారు. 'సినిమా టికెట్ల రేట్ల కోసం ప్రతీసారి ప్రభుత్వం చుట్టూ తిరగకుండా ఓ శాశ్వత ప్రతిపాదన చేయాలని పవన్ అన్నారు. నిర్మాతలంతా కూలంకషంగా చర్చించుకొని, సినిమా బడ్జెట్‌ను బట్టి రేట్లు ఎంతవరకు పెంచుకోవచ్చు? వారమా? 10 రోజులా? అనే నిర్ణయానికి వస్తే సీఎంతో చర్చిస్తానని పవన్ అన్నారు' అని Xలో స్పష్టం చేశారు.



## బ్రిటన్‌కు కొత్త ప్రధాని..
# భారత్‌తో బంధం కొనసాగేనా?

కశ్మీర్‌పై లేబర్ పార్టీ నేత జెరెమీ తీర్మానంతో డ్యామేజీ కలిగిందని తెలుసుకున్న ప్రధాని అభ్యర్థి స్టార్మర్ దిద్దుబాటు చర్యలు చేపట్టారు. కశ్మీర్ అంశం భారత్ అంతర్గత సమస్య అని చెప్పారు. ఇండియాతో వ్యూహాత్మక భాగస్వామ్యాన్ని కొనసాగిస్తామని మేనిఫెస్టోలో ప్రకటించారు. దీపావళి, హోళీ వంటి హిందూ వేడుకల్లోనూ పాల్గొన్నారు. దీన్నిబట్టి ఆయన ఇండియాతో మంచి బంధాన్ని కొనసాగిస్తారని విశ్లేషకులు చెబుతున్నారు.



## ఓటిటిలో వచ్చేసిన
# మిర్జాపూర్ 3

మన ఇండియన్ ఓటిటి దగ్గర పాపులర్ అయినటువంటి పలు క్రేజీ వెబ్ సిరీస్ లు ఉన్నాయి. మరి ఈ సిరీస్ లలో అయితే దాదాపు చాలా శాతం ప్రముఖ స్ట్రీమింగ్ యాప్ అమెజాన్ ప్రైమ్ వీడియోలోనే ఉన్నాయని చెప్పాలి. మరి ఇందులో సెన్సేషనల్ హిట్ అయినటు వంటి సిరీస్ లలో కేజ్రీ బోల్డ్ అండ్ గ్యాంగ్ స్టర్ సిరీస్ "మిర్జాపూర్" కూడా ఒకటి. ఇప్పటికే వచ్చిన రెండు సీజన్ లు మంచి హిట్ గా నిలవగా ఇప్పుడు ఈ సిరీస్ లో మూడో సీజన్ ఫైనల్ గా ఇప్పుడు అందుబాటు లోకి వచ్చేసింది. మొత్తం 10 ఎపిసోడ్స్ గా ప్రైమ్ వీడియో వారు ఒకేసా రి విడుదల చేసేసారు. అలాగే ముందు లానే హిందీ సహా అన్ని దక్షిణా ది భాషల్లో అందుబాటులోకి ఉంచారు. మరి ఈ క్రేజీ సిరీస్ మూడో సీజన్ కోసం ఎదురు చూస్తున్న వారికి ఇది గుడ్ న్యూస్ అని చెప్పాలి. ఇక ఈ వారాంతానికి మంచి ఓటిటి కంటెంట్ చూడాలి అనుకుం టున్న ఫ్యాన్స్ కి ఇది ట్రీట్ అని చెప్పొచ్చు. ఇక ఈ సిరీస్ లో పంకజ్ త్రిపాఠీ, శ్వేతా త్రిపాఠీ, అలీ ఫజల్ అలాగే గుండె జారి గల్లంత య్యిందే ఫేమ్ ఇషా తల్వార్ తదితరులు ముఖ్య పాత్రలు పోషించారు.




## హాట్ లుక్స్‌లో
# భాగ్యశ్రీ

ప్రముఖ సినీ నిర్మాణ సంస్థ పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీ బ్యానర్‌పై ప్రముఖ దర్శకుడు హరీష్ శంకర్ డైరెక్షన్‌లో టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిబొట్ల నిర్మాతలుగా మాస్ మహారాజ్ రవితేజ హీరోగా ఓ చిత్రం రూపొందుతున్నది. చాలా ఏళ్ల తర్వాత రవితేజ, హరీష్ శంకర్ కాంబినేషన్‌లో సినిమా రావడం అభిమానుల్లో ఉత్సాహం రేకెత్తించేలా చేసింది. అయితే రవితేజ సరసన ఓ బాలీవుడ్ భామను ఎంపిక చేసినట్టు ప్రకటించిన వార్త వైరల్ అయింది. ఆ భామ ఎవరు? ఆమె కెరీర్ ఎలా ఉందనే విషయంలోకి వెళితే.. రవితేజ నటించే సినిమా కోసం భాగ్యశ్రీ బోర్సేను ఎంపిక చేశారు. మోడల్, యువ హీరోయిన్‌గా రాణిస్తున్న ఈ సినిమా ద్వారా తెలుగు సినిమా రంగంలోకి అడుగుపెడుతున్నది. హీరోయిన్‌గా ఎంపిక చేసినట్టు ప్రకటించడానికి ముందు భాగ్యశ్రీ నాభి అందాలను బహిర్గతం చేస్తూ రవితేజ వాటేసుకొన్నట్టు చూపించారు. ఆ తర్వాత ఆమె ఫోటోను విడుదల చేశారు.



## టీజీపీఎస్సీ ముట్టడికి యత్నం..
# ఎక్కడికక్కడే అరెస్టులు

నిరుద్యోగ జేఏసీ ఆందోళన నేపథ్యంలో నగరంలో శుక్రవారం ఉదయం ఉద్రిక్త వాతావరణం నెలకొంది. పలు డిమాండ్ల సాధనతో ఆందోళనకు దిగిన జేఏసీ కార్యకర్తలు.. టీజీపీఎస్సీ కార్యాలయాన్ని ముట్టడించే యత్నం చేశారు. అయితే అప్పటికే నగరమంతా భారీగా మోహరించిన పోలీసులు.. ఎక్కడికక్కడే వాళ్లను అరెస్ట్ చేశారు. బీజేవైఎం, బీఆర్ఎస్వీ ఆధ్వర్యంలో నిరుద్యోగ జేఏసీ హైదరాబాద్‌లోని టీజీపీఎస్సీ కార్యాలయ ముట్టడికి పిలుపు ఇచ్చింది. దీంతో నగర పోలీసులు అప్రమత్తం అయ్యారు. నగర శివారుల్లో, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు, మెట్రో స్టేషన్లు.. ఎక్కడికక్కడే చెక్ పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు నిర్వహించారు. ఈ క్రమంలో పలువురిని అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు టీజీపీఎస్సీ కార్యాలయం వైపు దూసుకెళ్లే యత్నం చేసిన విద్యార్థి సంఘం నేతల్ని అరెస్ట్ చేసి స్టేషన్‌కు తరలించారు. గ్రూప్ 2, 3 పోస్టుల సంఖ్య పెంపు, గ్రూప్ 1 మెయిన్స్‌కు 1:100 నిష్పత్తి పాటించాలి, జాబ్ క్యాలెండర్, జీవో 46 రద్దు వంటి డిమాండ్లతో నిరుద్యోగులు పోరుబాటపట్టారు.



## అమరావతి నిర్మాణానికి
# టీడీపీ ఎంపీ విరాళం

అమరావతి నిర్మాణానికి విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు తన జీతాన్ని విరాళంగా అందించారు. ఎంపీగా ఇటీవల తొలి జీతం రూ.1.57 లక్షలు అందుకున్న ఆయన.. ఆ చెక్కును ఢిల్లీ పర్యటనలో ఉన్న సీఎం చంద్రబాబుకు అప్పగించారు. ఈ సందర్భంగా అప్పలనాయుడుని సీఎం అభినందించారు.




## ఐపీఓకు
# సిద్ధపడుతున్న జియో?

టారిఫ్ పెంచి, 5జీ మానిటైజేషన్‌కు జియో సన్నాహాలు చేస్తుండటంతో ఇతర నెట్‌వర్క్‌లూ అదే ఫాలో అవుతున్నాయి. అయితే ఐపీఓ లాంచ్‌కు జియో సిద్ధపడుతోందనడానికి ఇవి సూచనలని ట్రేడ్ వర్గాలు చెబుతున్నాయి. వచ్చే ఏడాది ఆరంభంలోనే ఐపీఓ ఉండొచ్చని పలువురు నిపుణులు అంచనా వేస్తున్నారు. వచ్చే నెల జరగనున్న రిలయన్స్ ఇండస్ట్రీస్ యాన్యువల్ జనరల్ మీటింగ్‌లో దీనిపై స్పష్టత వస్తుందంటున్నారు.



## ముంబై
# పోలీసులకు థాంక్స్: కోహ్లీ

ముంబైలో టీమ్ ఇండియా విజయోత్సవ యాత్రకు అభిమానులు అసంఖ్యాకంగా వచ్చారు. ఆ పరిస్థితిని ముంబై పోలీసులు సమర్థంగా ఎదుర్కొని శాంతిభద్రతలకు భంగం కలగకుండా చూశారు. ఈ నేపథ్యంలో వారికి భారత స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కృతజ్ఞతలు తెలిపారు. 'టీం ఇండియా విక్టరీ పరేడ్‌లో తిరుగులేని సమర్థత చూపించిన ముంబై పోలీసులకు హృదయపూర్వక కృతజ్ఞతలు. మీ నిబద్ధత, సేవ అద్భుతం. జైహింద్' అని ట్వీట్ చేశారు.